క్లుప్తంగా

నేడు నాగులపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి గ్రామ సచివాలయం-2 పరిధిలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య తెలిపారు. గ్రామంలోని రోగులకు నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. గ్రామస్తులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీలోకి గొరకపూడి!


గొరకపూడి చిన్నయ్యదొరతో మాట్లాడుతున్న దొరబాబు తదితరులు

సామర్లకోట: ఉమ్మడి జిల్లా భారతమాత సేవా పరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర వైఎస్సార్ సీపీలోకి చేరేందుకు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు.. చిన్నయ్యదొరను ఆయన స్వగృహంలో కలుసుకున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ చైర్‌పర్సన్‌గా పని చేశానని, వైఎస్సార్ అంటే తనకెంతో అభిమానమని చిన్నయ్యదొర చెప్పారు. పట్టణంలో డిగ్రీ కళాశాల, మహిళా కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల వచ్చేలా కృషి చేస్తున్నానన్నారు. ఈ మేరకు ఇప్పటికే డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, మహిళా కళాశాలతో పాటు, ఇంజినీరింగ్ కళాశాలను సామర్లకోటకు తీసుకొచ్చేలా కృషి చేస్తామని దొరబాబు హామీ ఇవ్వడంతో, వైఎస్సార్ సీపీలోకి చేరాలని నిర్ణయించుకున్నట్టు చిన్నయ్యదొర చెప్పారు. తన బంధువులు, స్నేహితులతో చర్చించి, రెండు రోజుల్లో పార్టీలో చేరుతానని వెల్లడించారు. స్థానిక అభ్యర్థి అయితేనే నియోజకవర్గ సమస్యలపై పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్లు పాగా సురేష్‌కుమార్, పిట్టా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యకు ముఖ్యమంత్రి ప్రాధాన్యం

సామర్లకోట: ముఖ్యమంత్రి విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. జి.మేడపాడు గ్రామంలో రూ.72 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ జెడ్పీ విభాగపు జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, ఎంపీఓ వై శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో సునీల్, దొరబాబు పూజలు


పూజలు చేస్తున్న సునీల్, దొరబాబు

సామర్లకోట: వేట్లపాలెం గ్రామంలో గోదావరి కాలువ ఆవలి వైపు ఉన్న శివాలయంలో వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు సోమవారం పూజలు చేశారు. ఆలయంలో శివరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీల్, దొరబాబును కమిటీ నాయకులు సత్కరించారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

పెద్దాపురం: ఏరియా ఆస్పత్రి అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ ఆస్పత్రి అవసరాలను తీర్చేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మామిడి ఈశ్వరరావు, చల్లా బ్రహ్మాజీ. ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ముగ్గురు గైర్హాజరు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ జి.సూర్యనారాయణ తెలిపారు. ఇక్కడ పరీక్షలకు మొత్తం 146 మంది హాజరు కావల్సి ఉండగా 143 మంది విద్యార్థులు హాజరైనట్టు వివరించారు.

చేబ్రోలు చరిత్రను తిరగరాస్తాం

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- చేబ్రోలులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం


చేబ్రోలులో కాలక్షేప మండపం, రథశాల నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం: మునుపెన్నడు లేనివిధంగా రూ.కోట్ల వ్యయంతో చేబ్రోలు గ్రామాన్ని అభివృద్ధి చేసి గ్రామ చరిత్రను తిరగరాస్తామని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. చేబ్రోలు సీతారామ ఆలయం వద్ద రూ.48 లక్షల సీజీఎఫ్ నిధులతో నిర్మించనున్న కాలక్షేప మండపం, రథశాల నిర్మాణానికి సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. రూ 3.40 కోట్లతో నిర్మించే పుంత రోడ్లుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొండపాటి లోవతల్లి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అభివృద్ధి చేయడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. చేబ్రోలు గ్రామాన్ని చరిత్రలో నిలిచిపోయేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశారన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్క గ్రామానికి రూ.కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటికే గ్రామంలో ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపించామని తెలిపారు. క్యాక్రమంలో జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ బత్తుల సాయి, వైఎస్సార్ సీపీ గొల్లప్రోలు మండలాధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, వైఎస్సార్ సీపీ నేత మొగలి బాబ్జి, పలువురు ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

50 ఏళ్ల సమస్యకు పరిష్కారం

- ఎంపీ చొరవతో సమస్యకు చెక్
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పిఠాపురం: గత 50 ఏళ్లుగా ఇళ్లపై నుంచి వెళ్లే హైటెన్షన్ విద్యుత్ వైర్లతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తుల సమస్యను రోజుల వ్యవధిలో పరిష్కరించారు కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత. పిఠాపురం మండలం భోగాపురంలో గత 50 ఏళ్లుగా నివాసముంటున్న ఇళ్లపై నుంచి హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయి. ఈ వైర్ల కారణంగా స్థానికులు పలు ప్రమాదాలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల పిఠాపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన ఎంపీ వంగా గీతకు స్థానికులు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఆమె విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. దానికి అయ్యే ఖర్చును రూ.6.50 లక్షల నిధులను ఆమె వెంటనే మంజూరు చేశారు. దీంతో అధికారులు పనులు ప్రారంభించారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమస్యకు పరిష్కారం చూపిన ఎంపీ గీతకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశాన వాటికను పరిరక్షించండి!

స్పందనలో ఆర్డీఓకు వినతి


ఆర్డీఓకు తమ గోడును విన్నవించుకుంటున్న స్థానికులు

పెద్దాపురం: లెప్రసీ కాలనీని అనుకుని ఉన్న శ్మశాన వాటికకు సరిహద్దులు లేకపోవడంతో ఆక్రమణకు గురవుతోందని సోమవారం జరిగిన స్పందనలో ఆర్డీఓ జేఎస్ రామారావుకు విజ్ఞాపన అందింది. ఈ మేరకు లూథరన్ చర్చి వాసులు తమ ఆవేదన వెళ్లగక్కారు. టౌన్ సర్వే నంబర్ 4-13-1076కి సంబంధించి సరైన హద్దులు తేల్చాలని కోరారు. అనంతరం ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతివారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్‌లో ఆయా మండలాల నుంచి పది అర్జీలు అందినట్టు తెలిపారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. డిటీ భానుకుమార్, డీఎల్‌పీఓ బాలామణి, సీడీపీఓ ఉష, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి పాల్గొన్నారు.

మడమ తిప్పని నేత జగన్


పెద్దాపురంలో దొరబాబు సమక్షంలో పార్టీలో చేరిన ప్రజలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు

పెద్దాపురం: మాట ఇచ్చి.. మడమ తిప్పని నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మర్లావ గ్రామంలో సోమవారం నవరత్నాలు అందరికీ ఇళ్లు పథకంలో మంజూరైన రిజిస్ట్రేషన్ పట్టాలను జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజాతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ అర్హత నున్న ప్రతిఒక్కరికీ ఇంటి పట్టాను మంజూరు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. నవరత్నాలు కింద ఇచ్చి పట్టాకు విలువ లేదంటూ ప్రతిపక్షాల చేసిన విమర్శలకు దీటుగా, ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారుడికి సొంత ఆస్తిపై సర్వ హక్కులూ కలిస్తూ, పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తున్నట్టు వివరించారు. ఏటిపట్టు పది గ్రామాలకు పట్టణ శివారులో రామేశంమెట్ట వద్ద స్థలాలు ఇవ్వడంపై కొందరు అవి పనికి రానివంటూ ప్రచారం చేశారని, అవే స్థలాలు ఇప్పుడు రూ.లక్షలు పెట్టినా పేదవాడు కొనలేని విధంగా మార్కెట్ ధర పెరిగిందన్నారు. పేదల స్థలాల వద్ద ఉన్న ఆదిత్య కళాశాల ఇప్పుడు యూనివర్సిటీ కావడంతో, విలువైన ఆస్తిగా మారిందని, ఇది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలవేనన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అనంతరం మర్లావ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చిందని దవులూరి దొరబాబు అన్నారు, మర్లావలో నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేసిన పాఠశాల తరగతి గదులను ఆయన ప్రారంభించారు. వైస్ ఎంపీపీ మిరియాల రాజా అధ్యక్షత వహించారు. దొరబాబు మాట్లాడుతూ విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యమిచ్చి అన్ని విధాలా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని కోరారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, నాయకులు కామన రామకృష్ణ, కాతా రాము, నడిగట్ల శ్రీనివాస్, లక్కాకుల కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 60 మంది చేరిక

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఆయనకు ఉన్న ప్రజాదరణే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి నాంది అవుతుందని దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం పట్టణంలో 15వ వార్డుకు చెందిన సుమారు 60 మంది మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో దొరబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చీకట్ల కిషోర్‌తో కలిసి దొరబాబు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, సీనియర్ నాయకులు తాడి రాజశేఖర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాపగంటి కామేశ్వరరావు, ముమ్మన ప్రకాష్, పడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు


వలంటీర్లను సత్కరించిన దొరబాబు తదితరులు

- వలంటీర్లకు వందనంలో దొరబాబు
- ఒకరికి సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న, 259 మందికి సేవామిత్ర అందజేత

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీరు వ్యవస్థను తీసుకు వచ్చారని, వీరే సంక్షేమ పథకాల సారథులని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు అర్హులను వలంటీర్ల ద్వారా ఎంపిక చేసి, వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా లబ్ధి చేరేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగడంతో పాటు, వలంటీరు వ్యవస్థ ఉండాలంటే జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. పొరపాటున వైఎస్సార్ సీపీ ఓటమి చెందితే, అదే సంక్షేమ పథకాల ముగింపు అవుతుందని చెప్పారు. వలంటీర్ల సేవల కారణంగానే రాష్ట్రంలోని 175 స్థానాల్లో విజయం సాధిస్తామనే ధీమాతో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. ప్రజలకు మేలు జరగడం వల్లే ధైర్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వలంటీర్లతో కలిసి విజయవంతం చేయగలిగామన్నారు. వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పోలింగ్ రోజు వరకూ ప్రతి ఇంటికీ వెళ్లి జగన్ వల్ల జరిగిన మేలును వివరించాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో ఒకరు సేవా వజ్రా, ఐదుగురు సేవా రత్న, 259 మంది సేవా మిత్రాలుగా ఎంపికయ్యారని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు చెప్పారు. అవార్డు గ్రహీతలను వార్డుల వారీగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియామేరీ, అధికార పార్టీ కౌన్సిలర్లు, సచివాలయ కార్యదర్శులు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, గృహ సారథుల పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక అభ్యర్థే ప్రజల ఆకాంక్ష

ఎన్నికల ప్రచారంలో దవులూరి దొరబాబు


సామర్లకోటలో విజయ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్న దొరబాబు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో ప్రజలు స్థానిక అభ్యర్థినే కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం నుంచి దొరబాబు తన విజయ సంకల్ప యాత్రతో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సత్తెమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. అడుగడుగునా మహిళలు హారతి పట్టి, దొరబాబుకు స్వాగతం పలికారు. దొరబాబు పెద్ద కుమార్తె ప్రణవి తండ్రికి అండగా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 40 ఏళ్ల తర్వాత స్థానిక అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదం కోసం విజయ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పెద్దాపురం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని ప్రకటించారు. స్థానికేతరులకు నియోజకవర్గ సమస్యలపై అవగాహన లేకపోవడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలే తమ విజయానికి పునాది అని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియామేరీ, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి అంశాలకు ఆమోదం


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మోజెస్

సామర్లకోట: పట్టణాభివృద్ధికి సంబంధించి మున్సిపాలిటీ అధికారులు అజెండాలో పొందుపర్చిన అంశాలను ఆమోదిస్తున్నట్టు మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం జరిగింది. మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు సంబంధించి 30 అంశాలు ఉన్నాయని, వాటిని ఆమోదిస్తున్నట్టు మోజెస్ తెలియజేయగానే, అధికార పక్ష సభ్యులు ఆమోదిస్తున్నట్టు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ నుంచి వచ్చిన 31వ అంశాన్ని వాయిదా వేయాలని వైస్ చైర్మన్ సూచించారు. దాంతో ప్రతిపక్ష సభ్యుడు బలుసు వాసు మాట్లాడుతూ ఆమోదించడానికి ఎంత మెజార్టీ ఉండాలని ప్రశ్నించారు. సమావేశానికి హాజరైన సభ్యుల్లో మెజార్టీ సభ్యుల ఆమోదం ఉంటే సరిపోతుందని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ తెలిపారు. అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించడంతో కౌన్సిల్ సమావేశం ముగిసిందని చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రకటించారు. దాంతో అవాక్కవడం ప్రతిపక్ష సభ్యుని వంతయింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జె.రామా రావు, వైస్ చైర్‌పర్సన్-2 గోకిన సునేత్రదేవి, అధికార, ప్రతిపక్ష సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపుష్పయాగం

కొత్తపల్లి: గ్రామంలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి శ్రీపుష్పయాగం వైభవంగా జరిగింది. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పలు రకాల పూలతో శాస్త్రోక్తంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీపుష్పయాగాన్ని తిలకించారు.

పట్టాలకు రిజిస్ట్రేషన్లు ఓ చరిత్రే..

వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్లు దొరబాబు, సునీల్


వేట్లపాలెంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న సునీల్, దొరబాబు

సామర్లకోట: పేద ప్రజలకు 31 లక్షల ఇళ్ల పట్టాలు అందజేయడమే కాకుండా, వాటికి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం దేశ చరిత్రలోనే ప్రథమమని వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంటరీ కో-ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం వేట్లపాలెం గ్రామంలో రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. జి.మేడపాడు గ్రామంలో, సామర్లకోట మున్సిపాలిటీలోను లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో దొరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద వారికి సొంతింటి కల నెరవేరాలనే లక్ష్యంతో, ఎంతటి కష్టమైనా ఇచ్చిన మాటకు కట్టుబడి ఇళ్ల స్థలాలు అందజేశారన్నారు. తన పాదయాత్రలో 25 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చి, 31 లక్షలకు మించి అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంతో, అవసరమైనప్పుడు వాటిని అమ్ముకునే హక్కు ఉంటుందన్నారు. పేదవారికి రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు ఆస్తి ఏర్పాటు చేశారని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత లబ్ధిదారులపై ఉందన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు.. జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ కాకినాడ జెడ్పీ విభాగపు అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నిడదవోలు సురేష్ చౌదరి పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు చీకట్ల కిషోర్, రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, పార్టీ పట్టణ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్, అధికార పార్టీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ తొలి గరగ ఉత్సవం


అమ్మవారి ఆలయంలో ఉంచిన తొలి గరగ

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి తొలి గరగ ఉత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ గవరసాని వీరస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు పల్లా గంగారావు, సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ జాగు వీరభద్రరావు తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం నుంచి తొలి గరగ ఉత్సవాన్ని రాత్రి 8.26కు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, పార్లమెంటరీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ ప్రారంభించారు. అనంతరం ఆలయం నుంచి గరగను డప్పు వాయిద్యాలు, బ్యాండ్‌మేళం మధ్య ఊరేగించారు. పెద్దాపురం వైస్ ఎంపీపీ మిరియాల రాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, గోపు మురళి, గంటా రామస్వామి, లక్కాకుల నానాజీ, గవరసాని రాజశేఖర్ పాల్గొన్నారు.

జోరుగా కేబుల్ ఆపరేటర్ల రిజిస్ట్రేషన్లు

సామర్లకోట: కేబుల్ ఆపరేటర్ల పోస్టల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ హెడ్ పోస్టాఫీసులో సోమవారం జోరుగా సాగింది. కాకినాడ జిల్లా కేబుల్ ఆపరేటర్ల సంఘ ప్రతినిధులు బండారు కృష్ణమూర్తి, అడపా వెంకట్రావు ఆధ్వర్యంలో పోస్టల్ అధికారుల సమన్వయంతో రిజిస్ట్రేషన్లు నిర్వహించారు. సోమవారం 150 దరఖాస్తులు వచ్చాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొన్ని నిబంధనలను సడలించి, పోస్టల్ అధికారులు ఆపరేటర్ల వినతిని అంగీకరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. సామర్లకోట, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం, గొల్లప్రోలు, శంఖవరం, కిర్లంపూడి మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు. హెడ్ పోస్టుమాస్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మంగళవారం కూడా సేవలందిస్తామన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామి కల్యాణ ఉత్సవాల ముగింపు, స్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయంలో బారులు తీరారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పిఠాపురం మహారాజా గోత్ర నామాలతో తొలి అభిషేకం, తొలి పూజలు నిర్వహించారు. ఆలయం, మూలవిరాట్, అమ్మవారి ఆలయంతో పాటు, ఉపాలయాలనూ పూలతో అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగానికి పాలు, చెరకు రసం, నీళ్లతో అభిషేకాలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పారిశ్రామిక వేత్త అమలకంటి శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన పూలతో సాయంత్రం స్వామి వారిని, అమ్మవార్లను ప్రత్యేకాలంకరణలు చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా ఆదిత్య స్కూల్ వార్షికోత్సవం



అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పిఠాపురం: స్థానిక ఆదిత్య పబ్లిక్ స్కూల్ 10వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. పాఠశాలలో తొలుత ప్రముఖ వక్త మాకిన సతీష్, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, చేయూత ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు ఎం. రవికుమార్ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శృతిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు అధునాతన పద్ధతుల్లో విద్యాబోధన చేస్తున్నామన్నారు. సమాజ విలువలను పెంపొందించేలా వేద గణితం, అబాకస్, ఏడీఏపీటీ వంటి అత్యాధునిక విద్యా ప్రమాణాలను సంస్థ అందిస్తోందన్నారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను ఆదిత్య సంస్థ అందిస్తోందని చేయూత ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు ఎం.రవికుమార్ అన్నారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.విజయసారథి, సిబ్బంది మాధవి, శ్రీనివాస్, కిరణ్, రేవతి తదితరులు పాల్గొన్నారు.